ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
గురువారం 4 జూలై 2024




కేసముద్రంలో ఇంటి నిర్మాణం మధ్యలో నిలిచిపోవడంతో టార్పాలిన్లతో గుడారంలో నివసిస్తున్న మాన్‌సింగ్, హైమా

- అసెంబ్లీ ఎన్నికలకు ముందు 'గృహలక్ష్మి' పథకంలో ఇళ్లకు హడావిడిగా అనుమతి పత్రాలు
- జిల్లా వ్యాప్తంగా 8,670 మంజూరు
- శాసనసభ ఎన్నికల ఫలితాల అనంతరం రద్దు
- అసంపూర్తి నిర్మాణాలతో లబ్ధిదారులకు ఇబ్బందులు

గృహయోగం ఎప్పుడో?



కేసముద్రం, జూలై 3 : పేద, మధ్య తరగతి వర్గాలకు సొంతింటి కల సాకారమయ్యేలా లేదు. అసెంబ్లీ ఎన్నికల ముందు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇల్లు కట్టుకోవడానికి సహాయం చేస్తుందనే ఆశతో 'గృహలక్ష్మి' పథకంలో భాగంగా గృహనిర్మాణాన్ని చేపట్టగా.. ఈ స్కీమ్‌ను ఇప్పటి కాంగ్రెస్ సర్కారు రద్దు చేసింది. దీంతో లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పథకం మంజూరైందన్న ఆశతో ఉన్నఇల్లును తొలగించుకొని, నిర్మాణం చేపట్టగా అర్ధాంతరంగా పథకం నిలిచిపోవడంతో లబ్ధిదారులు వీధినపడినట్లయింది. ఇప్పటి వరకు ఇంటి నిర్మాణం కోసం అప్పులు తీసుకురాగా, పథకం నుంచి ఒక్క రూపాయి రాకపోవడంతో వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సొంతస్థలం ఉన్న వారికి ఇల్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందించేందుకు 'గృహలక్ష్మి' పథకం రూపొందించింది. ఈ పథకంలో ఇచ్చిన ఆర్థిక సహాయం వందశాతం రాయితీతో తిరిగి చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఇందుకోసం ప్రత్యేక బ్యాంకుఖాతాను లబ్ధిదారుని పేరిట తీయాల్సిఉంటుంది. ఇంటిని బేస్‌మెంట్ స్థాయి నిర్మాణం అయ్యాక రూ.లక్ష, రూఫ్‌లెవల్‌లో రూ.లక్ష, నిర్మాణం అంతా పూర్తయ్యాక మిగిలిన రూ.లక్ష అందజేస్తారు. కొత్తగా మంజూరు చేసే ఇళ్లు పూర్తిగా మహిళల పేరిటే నమోదు ఉండాలనే నిబంధనలు పెట్టారు. లబ్ధిదారులు తమసొంత డిజైన్ ప్రకారం ఇల్లు నిర్మించుకునే అవకాశం కల్పించారు. ప్రభుత్వం ఆమోదించిన గృహలక్ష్మి పథకం లోగోను ఇంటిపై ఏర్పాటు చేయాలనే నిబంధన విధించారు. లబ్ధిదారులు ఖచ్చితంగా ఆహారభద్రత కార్డుతోపాటు సొంత స్థలం కలిగి ఉండాలి. స్థానికురాలై, ఓటరు గుర్తింపుకార్డు, ఆధార్ కార్డులు కలిగి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రాధాన్యతనిస్తూ ప్రతీ నియోజకవర్గంలో ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీలు, మైనార్టీలకు 50 శాతానికి తగ్గకుండా కేటాయించాల్సి ఉంది. దరఖాస్తుదారులు, కుటుం సభ్యులు ఇప్పటికే ఇళ్ల పథకంలో లబ్ధిపొంది ఉంటే ఈ స్కీంకు అనర్హులుగా ప్రకటిస్తారు.

నియోజకవర్గానికి 3000 ఇళ్లు..

మహబూబాబాద్ జిల్లాకు 8,670 ఇళ్లను గృహలక్ష్మి పథకం కోసం కేటాయించారు. వీటిలో నియోజకవర్గానికి 3000 ఇళ్లు చొప్పున కేటాయించగా.. జిల్లాలో మహబూబాబాద్, డోర్నకల్ పూర్తిస్థాయిలో ఉన్న నియోజకవర్గాలు కావడంతో 6వేల ఇళ్లు కేటాయించారు. ఇక జిల్లాకు పొరుగున ఉన్న పాలకుర్తి నియోజకవర్గంలోని ఈ జిల్లా మండలాలైన తొర్రూరు అర్బన్, తొర్రూరు రూరల్, పెద్దవంగరకు 1500 ఇళ్లు కేటాయించారు. ఇల్లందు నియోజకవర్గ పరిధిలో ఉన్న జిల్లాలోని మండలాలైన బయ్యారం, గార్లకు 670, ములుగు నియోజకవర్గంలోని కొత్తగూడ, గంగారం మండలాలకు 500 ఇళ్లు కేటాయించారు.

ఈ పథకానికి గత ఏడాది ఆగస్టు 8 నుంచి 10 వరకు దరఖాస్తులను స్వీకరించారు. చివరిరోజు వరకు జిల్లాలో 52,241 దరఖాస్తులు రాగా, మరుసటి రోజుకూడా దరఖాస్తులను స్వీకరించడంతో 57, 129కి చేరాయి. జిల్లాలో 18 బృందాలను ఏర్పాటు చేసి అదేనెల 11 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులను పరిశీలించారు. వాటిలో దాదాపు 23వేల మందిని అర్హులుగా గుర్తించగా 21వేల మంది వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అర్హులైన వారిలో జిల్లాకు కేటాయించిన 8,670 ఇళ్లకు ప్రొసీడింగ్‌లను జారీ చేశారు.

అర్ధాంతరంగా నిలిచిన నిర్మాణాలు..

'గృహలక్ష్మి' పథకంలో ఇళ్ల మంజూరైన లబ్ధిదారులు హడావుడిగా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఉన్న ఇంటిని తొలగించుకొని అక్కడే టార్పాలీన్లతో తాత్కాలిక గుడారం ఏర్పాటు చేసుకున్నారు. మరికొంతమంది నిర్మాణం చేసే ఇంటికి సమీపంలోనే మరో ఇంటిని అద్దెకు తీసుకున్నారు. ఇక తమఇంటి నిర్మాణం పూర్తయి సొంతఇంటి కల నెరవేరుతుందని భావించిన లబ్ధిదారులకు చుక్కెదురైంది. బ్యాంకు ఖాతాలుతీసి ఇళ్లను బేసిమెంట్‌లెవల్ వరకు నిర్మాణం పూర్తి చేసి రూ.లక్ష ఆర్థిక సహాయం కోసం ఎదురుచూశారు. అప్పటికే అసెంబ్లీ ఎన్నికల కోడ్ సమీపిస్తుండడంతో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులను విడుదల చేయకుండా జాప్యం చేసింది. ఈలోగా కోడ్ రావడంతో నిధుల విడుదల నిలిచిపోయింది. ఆ తర్వాత అసెంబ్లీ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి పాలై కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేసింది. అర్హులైన వారి సంఖ్య అధికంగా ఉండడం, మంజూరైన గృహాలు తక్కువగా ఉండడంతో లబ్ధిదారుల ఎంపికలో పార్టీపరంగా ఎమ్మెల్యేలు, ఇతర రాజకీయ పైరవీలు ఉన్నవారికే మంజూరయ్యాయనే ఆరోపణలు ఉండడంతో పథకాన్ని నిలిపివేశారు. అయితే ఇందులో ఇల్లు నిర్మించుకునే వారంతా పేద, మధ్యతరగతి వర్గాలకు చెందినవారే ఉండడంతో ఆర్థికంగా సతమతమవుతున్నారు.

'ఇందిరమ్మ పథకం'పైనే ఆశలు..

కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించింది. ఈ మేరకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎప్పుడు అమలవుతుందా? అని ఈ లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా ఇందిరమ్మ పథకంలో తమకు ఇళ్లను మంజూరు చేసి, ఆదుకోవాలని గృహలక్ష్మి పథకంలోని లబ్ధిదారులు కోరుతున్నారు.



ఇంటికోసం వ్యవసాయభూమి అమ్ముకున్నా..

- గుగులోత్ హైమా, బ్రహ్మంగారితండా, కేసముద్రం స్టేషన్

'గృహలక్ష్మి' పథకంలో ఇల్లు మంజూరైందని ఉన్నఇంటిని తొలగించి టార్పాలిన్లతో గుడారం వేసుకొని జీవిస్తున్నాం. ఇంటినిర్మాణానికి డబ్బులు లేకపోతే 20 గుంటల వ్యవసాయ భూమిని అమ్ముకున్నా. పిల్లర్ల వరకు నిర్మాణం పూర్తయ్యేసరికి డబ్బులు అయిపోయాయి. ప్రభుత్వ ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్నాం. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆగిపోయిన ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయించి, ఆదుకోవాలి.

సర్వత్రా సమ్మతం

- ములుగు జిల్లాకు 'సమ్మక్క, సారలమ్మ' పేరుకు జనామోదం
- పేరు మార్పునకు గ్రామసభల నిర్వహణ
- కలెక్టర్‌కు మినిట్స్ అందజేసిన అధికారులు
- 'రామప్ప' పేరుపెట్టాలని పాలంపేట వాసుల వినతి
- కలెక్టర్‌కు విన్నవించనున్న పరిరక్షణ కమిటీ


వాజేడు మండలం చంద్రుపట్లలో చేతులెత్తి సమ్మతం తెలుపుతున్న ప్రజలు

ములుగు, జూలై 3 : తమ ఆరాధ్య దైవాలైన ఆ వనదేవతలు సమ్మక్క, సారలమ్మ పేరును ములుగు జిల్లాకు పెట్టేందుకు తమకు ఎలాంటి అభ్యంతరాలు లేవని మెజారిటీ ప్రజలు సమ్మతం తెలిపారు .అయితే రామప్ప దేవాలయం తమ ఆత్మగౌరవ ప్రతీక అని.. వనదేవతల పేరును తాము కాదనలేమని, కానీ రామప్ప పేరును కూడా జిల్లాకు పరిశీలించాలంటూ రామప్ప పరిరక్షణ కమిటీ కలెక్టర్‌కు నేరుగా వినతి పత్రం అందజేసింది. ములుగు జిల్లా పేరును సమ్మక్క, సారలమ్మ ములుగు జిల్లాగా మార్చేందుకోసం రాష్ట్రమంత్రి సీతక్క ప్రతిపాదన మేరకు కలెక్టర్ టీఎస్.దివాకర పబ్లిక్ నోటీసును జారీ చేశారు. ఈక్రమంలో జిల్లావ్యాప్తంగా బుధవారం ప్రత్యేక గ్రామసభలు జరిగాయి. వానాకాలం వ్యవసాయ పనులు జోరుగా సాగుతుండటంతో ప్రజలు కొద్దిసంఖ్యలోనే పాల్గొనగా.. గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో జరిగిన ఈ సభల్లో మెజారిటీ ప్రజలు సమ్మక్క, సారలమ్మ పేరుకు అంగీకారం తెలిపారు. వనదేవతలు కొలువైన మేడారంలో జరిగిన సభలో ప్రజలు ఏకవాక్యంగా వనదేవతల పేరుకు జైకొట్టారు. కొందరు రాతపూర్వకంగా అభిప్రాయాలు, అభ్యంతరాలను తెలియజేయగా.. చాలామంది చేతులెత్తి సమ్మతం తెలిపారు. మినిట్స్ నమోదు చేసిన అధికారులు నివేదిక రూపంలో జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు.

తెరపైకి రామప్ప పేరు..

వెంకటాపూర్ మండలం పాలంపేటలో జరిగిన గ్రామసభలో పాల్గొన్న స్థానికులు మాత్రం రామప్ప ములుగు జిల్లాగా నామకరణం చేయాలని కోరారు. ఇప్పటికే తాడ్వాయి మండలం, జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం, తుపాకులగూడెం బ్యారేజీలకు వనదేవతల పేరు పెట్టారని గుర్తుచేశారు. యునెస్కో గుర్తింపుతో ప్రపంచ ఖ్యాతిపొందిన రామప్ప పేరును ములుగు జిల్లాకు పెట్టడం ద్వారా పురాతన కట్టడ ప్రాముఖ్యత మరింత పెరుగుతుందని రామప్ప పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ఆకిరెడ్డి రామ్మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు పరిరక్షణ కమిటీ ప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి నేరుగా వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

ఎమ్మెల్యే మురళీనాయక్


మానుకోటలో మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు

మహబూబాబాద్ టౌన్, జూలై 3 : మొక్కలు నాటి వృక్ష సంపదను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ 29వ వార్డు పరిధిలోని మందుల బజారులో 75వ వనమహోత్సవంలో భాగంగా బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు అడవులు అంతరించిపోయి పర్యావరణం దెబ్బతిని సకాలంలో వర్షాలు కురవడంలేదని వాపోయారు. అక్కడక్కడ రోడ్ల విస్తరణలో భాగంగా చెట్లునరికి వేసిన ప్రాంతాల్లో మళ్లీ మొక్కలు నాటివాటిని సంరక్షించాలని తెలిపారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మొక్కలు నాటివాటిని సంరక్షించి భావితరానికి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించాలని చెప్పారు. మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, సానిక వార్డుకౌన్సిలర్, మునిసిపల్‌ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య, కమిషనర్ నోముల రవీందర్, డీఈ ఉపేందర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ క్రాంతి, కౌన్సిలర్లు ఎడ్ల వేణు, బోనగిరి గంగాధర్, డౌలాగర్ శంకర్, శివ, వివిధ పార్టీల నాయకులు బానోత్ రవికుమార్, మంగలంపల్లి కన్న, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, మంగలంపల్లి రాజ్‌కుమార్, ఎడ్ల రమేష్, ఖలీల్‌పాష, కుర్ర మహేష్, బెజ్జం ఐలేష్, పింద్రాల రాందాసు, ఆరెందుల వెంకటేశ్వర్లు, బోళ్ల రాజు పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ జిల్లా నేతలు


ఎర్రవల్లిలో కేసీఆర్‌తో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మానుకోట మునిసిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, తదితరులు

మహబూబాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి ఫాంహౌస్‌లో బుధవారం మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నేతలు మాజీ సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఇటీవలకేసీఆర్ ఎర్రవల్లిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్మన్లు, బీఆర్‌ఎస్ నేతలతో సమావేశమవుతూ.. బీఆర్‌ఎస్ పటిష్టతపై దిశానిర్దేశం చేస్తున్నారు. ఇందులో భాగంగా మహబూబాబాద్ నుంచి ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మానుకోట మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, సీనియర్ నాయకులు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, పర్కాల శ్రీనివాస్ రెడ్డి, గద్దె రవి, బానోత్ రవికుమార్, బానోత్ బాలాజీనాయక్, మునిసిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు కేసీఆర్‌ను ఎర్రవల్లిలో కలిశారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్‌కు మంచి భవిష్యత్ ఉంటుందని, నాయకులంతా కలిసి కట్టుగా పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని కేసీఆర్ దిశానిర్దేశం చేసినట్లు బీఆర్‌ఎస్ నేతలు తెలిపారు.

ప్రజల ఆమోదం ఉంటేనే కేసముద్రం మునిసిపాలిటీ

- మూడు మండలాల్లోని రోడ్లకు రూ.75కోట్లు
- నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి
- కేసముద్రంలో డిగ్రీ కళాశాల మంజూరు
- సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి
- తండ్రి, సోదరుడి విగ్రహాల ఆవిష్కరణ


అర్పనపల్లిలో తండ్రి, సోదరుడి విగ్రహాలను ఆవిష్కరిస్తున్న సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి

కేసముద్రం, జూలై 3 : కేసముద్రం ప్రజల ఆమోదం ఉంటూ అందరూ సానుకూలంగా స్పందిస్తేనే మునిసిపాలిటీగా చేస్తామని సీఎం సలహాదారుడు, మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డి అన్నారు. అర్పనపల్లిలో బుధవారం తండ్రి చెన్నకృష్ణారెడ్డి, అన్న పురుషోత్తం రెడ్డి కాంస్య విగ్రహాలను నరేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. కేసముద్రం మండలకేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో కేసముద్రం మీదుగా భద్రాచలం, వేములవాడ బస్సు సర్వీసులను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే మహబూబాబాద్ నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చే విధంగా అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ తీసుకుంటానని అన్నారు. కేసముద్రంలో రూ.25 కోట్లతో సెంట్రల్ లైటింగ్, డబుల్ రోడ్డు నిర్మాణాలకు టెండర్లు పిలిచామని త్వరలో పనికూడా ప్రారంభమవుతుందని వేం తెలిపారు. కేసముద్రం, గూడూరు, నెల్లికుదురు మండలాల్లో మూడు రోడ్లకు రూ.75కోట్లు మంజూరయ్యాయని వివరించారు. త్వరలో నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని, ఒక్కో ఇంటికి రూ.5లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందుతుందని వెల్లడించారు. రాబోయే ఐదేళ్లలో నియోజకవర్గానికి 15వేల నుంచి 20 వేల ఇళ్లను నిర్మించాలనేదే లక్ష్యమని తెలిపారు.

ఈ విద్యాసంవత్సరం నుంచే..

కేసముద్రం మండల కేంద్రంలో డిగ్రీ కళాశాలను మంజూరు చేయించినట్లు వేం నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ కళాశాల ఈ విద్యా సంవత్సరంలో తాత్కాలికంగా జూనియర్ కళాశాలలో ప్రారంభిస్తామని తెలిపారు. త్వరలో ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు, 300 పడకల ఆస్పత్రిని మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కేసముద్రంలో డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నికల్ కళాశాలలను తీసుకురావడం తన సోదరుడు పురుషోత్తంరెడ్డి లక్ష్యమని, ఆయన కోరిక మేరకు డిగ్రీ కళాశాల మంజూరు చేయించినట్లు భావోద్వేగంతో తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, గాయత్రి గ్రానైట్స్ యజమాని వద్దిరాజు కిషన్, ఎంపీపీ వోలం చంద్రమోహన్, జడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్ రావు, కాంగ్రెస్ జిల్లా, మండలస్థాయి నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవలె రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సబ్‌స్టేషన్‌తండా తాజా మాజీ సర్పంచ్ వెంకన్న ఇంటికి వెళ్లి ఆ కుటుంబాన్ని నరేందర్‌రెడ్డి పరామర్శించారు.

నరేందర్‌రెడ్డికి వినతులు..

మండలంలోని నారాయణపురంలో రైతుపేరు 'అడవి' అని ధరణిలో నమోదైన ఉన్న పట్టాపాస్‌పుస్తకాలను రైతుల పేరిట జారీ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన పలువురు రైతులు వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వీవోఏల సమస్యలను, సమగ్ర శిక్షలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పరిష్కరించాలని వేం నరేందర్‌రెడ్డి తో పాటు ఎమ్మెల్యే మురళీనాయక్‌ను కలిసి ఆయా సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు.



బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

- ఈనెల 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం
- ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్


ఆపరేషన్ ముస్కాన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, జూలై3 : బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతీ ఒక్కరు సహకరించాలని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ పిలుపునిచ్చారు. మానుకోటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం 'ఆపరేషన్ ముస్కాన్' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 1వ తేదీ నుంచి 31 వరకు జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. జిల్లా అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ప్రతీ సబ్‌డివిజన్ పరిధిలో ఎస్సై, నలుగురు సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా రెండు ప్రత్యేకబృందాలు నెలరోజుల పాటు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని వివరించారు. బాల కార్మికులను గుర్తించడానికి దాడులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే 1098 లేదా డయల్ 100కు, స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం డీఎస్పీ గంద్రాతి మోహన్ ఆధ్వర్యంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ డిపార్ట్‌మెంట్, విద్యాశాఖ, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్‌మెంట్, వైద్య ఆరోగ్యశాఖ అధికారుల సమన్వయంతో దాడులు నిర్వహించనున్నట్లు చెప్పారు. కిరాణాషాపు, మెకానిక్ షాపు, హోటళ్లు, ఇటుక బట్టీలు, కోళ్ల ఫాంలు, రోడ్లపై బిక్షాటన చేస్తున్న పిల్లలను గుర్తించి వారిని సంరక్షణ గృహాలకు తరలిస్తామని చెప్పారు. ఎవరైనా బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే వారిపై క్రిమినల్ కేసు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

ఈ సమావేశంలో డీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగవాణి, డీడబ్ల్యూవో వరలక్ష్మి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో అంబరీష, లేబర్ కమిషనర్ జగదీష్, లేబర్ ఆఫీసర్ రమేష్, డీఈవో రామారావు, లక్ష్మి, నరేష్, కల్యాణ్, వసుంధర, అనిల్, సీసీఎస్ సీఐ చంద్రమౌళి, డీసీఆర్బీ సీఐ సత్యనారాయణ, సీసీఎస్ ఎస్సై ఉమ పాల్గొన్నారు.

ఎస్సెస్సీలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

- జిల్లా విద్యాశాఖాధికారి రామారావు


శనిగపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న రామారావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై3 : పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకొని, ముందుకు సాగాలని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు సూచించారు. బుధవారం మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని శనిగపురం ప్ర భుత్వ ఉన్నత పాఠశాల ప్రార్ధనకు ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి నుంచే ఎస్సెస్సీ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి వందశాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు 10జీపీఏ వచ్చేలా విధంగా చూడాలన్నారు. పాఠశాల ఆవరణలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు దాశరథి శ్రీధర్, ఉపాధ్యాయులు జి. వెంకన్న, బి. వెంకన్న పాల్గొన్నారు.

అవార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం..

జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నఉపాధ్యాయు లు, ప్రధానోపాధ్యాయులు జాతీయ ఉత్తమ ఉపాధ్యా య అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రామారావు కోరారు. 2024 విద్యాసంవత్సరానికి గాను భారత ప్రభుత్వ విద్యామంత్రిత్వశాఖ అర్హులైన ఉపాధ్యాయుల నుంచి వెబ్‌సైట్ http://nationalawardstoteachers.education.gov.inలో ఈనెల 15 లోగా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపిక మార్గదర్శకాల కోసంపైన ఉన్న వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

విజ్ఞాన భాండాగారం.. ‘ఆస్కార్’ గ్రంథాలయం

- స్వగ్రామం చల్లగరిగలో నిర్మించిన సినీ గేయ రచయిత చంద్రబోస్
- నేడు ప్రారంభోత్సవం.. హాజరవనున్న పలురంగాల ప్రముఖులు

చిట్యాల, జూలై 3: పుట్టిన ఊరిపై మమకారంతో.. గ్రామస్థులకు ఇచ్చిన మాటకు కట్టుబడి.. తాను సాహితీ ఓనమాలు నేర్చుకున్న చోట అధునాతన గ్రంథాలయ భవనాన్ని నిర్మించారు ఆస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ సినీ గేయ రచయిత కనుకుంట్ల చంద్రబోస్. తన తల్లి కనుకుంట్ల మధునమ్మ జ్ఞాపకార్థం రూ. 36 లక్షలతో స్వగ్రామమైన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగ గ్రామంలో హంగులతో నిర్మించిన ఆ గ్రంథాలయాన్ని గురువారం ప్రారంభించనున్నారు. చంద్రబోస్ పాఠశాల విద్యనభ్యసించే సమయంలో నిత్యం ఇక్కడి గ్రంథాలయంలోని సాహిత్య పుస్తకాలను చదువుకుంటూ, ఆపక్కనే ఉన్న శివాలయంలో సేదతీరే వారని, భజనపాటలు పాడుతూ, సాహిత్యంపై మక్కువ పెంచుకున్నారని ఆయన చిన్ననాటి మిత్రులు తెలిపారు. పదో తరగతి వరకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివిన చంద్రబోస్ 1984-85లో పదో తరగతి పూర్తికావడంలో పాలిటెక్నిక్‌లో చేరారు. కొంత కాలం ప్రైవేటు ఉద్యోగం చేసి.. 1994-95లో తాజ్‌మహల్ సినిమాలో మంచు కొండల్లోని చంద్రమా అనే పాటతో సినీ రంగ ప్రవేశం చేశారు. నేనున్నాను సినిమాలో మౌనంగానే ఎదగమని, చీకటితో వెలుగే చెప్పెను అనే రెండు పాటలకు నంది అవార్డులు దక్కించుకున్న చంద్రబోస్ ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని నాటు.. నాటు పాటకు ఇటీవల గోల్డెన్ గ్లోబల్ అవార్డుతో పాటు ప్రపంచ ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డును దక్కించుకున్నారు. ఇప్పటివరకు మూడు వేలకు పైగా సినిమా పాటలు రాసిన చంద్రబోస్ తండ్రి నర్సయ్య రిటైర్డు టీచర్ కాగా తల్లి మధునమ్మ మూడేళ్ల క్రితం కన్నుమూశారు. ఆమె జ్ఞాపకార్థం చంద్రబోస్ స్వగ్రామం చల్లగరిగలో ‘ఆస్కార్’ గ్రంథాలయాన్ని నిర్మించారు.

అందరి సహకారంతోనే నిర్మించగలిగా : చంద్రబోస్, సినీగేయ రచయిత

‘ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో నేను రాసిన నాటు.. నాటు.. పాటకు ఆస్కార్ అవార్డు వచ్చిన సమయంలో నా గ్రామంలోని బాల్య మిత్రులు, గ్రామస్థులు అభినందన సభ ఏర్పాటు చేయగా.. నాకు ఎంతో విజ్ఞానాన్ని అందించిన గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడాన్ని చూసి ఎంతో బాధపడ్డా.. అమ్మ జ్ఞాపకార్థం నూతన భవనం నిర్మించాలని నిర్ణయించుకున్నా. స్నేహితులు, గ్రామస్థుల సహకారంతో.. మా నాన్న నరసయ్య, అన్నయ్య రాజేందర్ తోడ్పాటుతో అనుకున్న సమయానికి ముందుగానే నిర్మాణం పూర్తయింది’ అని చంద్రబోస్ ‘ఆంధ్రజ్యోతి’తో పేర్కొన్నారు. ఈ భవనాన్ని గురువారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మతో పాటు పలువురు ప్రముఖుల సమక్షంలో ప్రారంభిస్తున్నామన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పుస్తకాలకు తోడుగా అన్ని రకాల పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని, చల్లగరిగ గ్రామస్థులే కాకుండా మండల ప్రజలు ఈ ఆస్కార్ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఇక గురువారం జరిగే ప్రారంభోత్సవానికి పలురంగాల ప్రముఖులు హాజరవుతున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేశామని గ్రంథాలయాల జిల్లా కార్యదర్శి శ్రీలత తెలిపారు. ఇప్పటివరకు స్థానిక గ్రంథాలయంలో రికార్డు అసిస్టెంట్ మాత్రమే ఉండేవారని, రేపటి నుంచి ప్రత్యేకంగా ఒక అధికారిని నియమిస్తామని ఆమె వెల్లడించారు.




ప్రారంభానికి సిద్ధమైన ఆస్కార్ గ్రంథాలయం, సినీ గేయ రచయిత చంద్రబోస్

వార్డు ఆఫీసర్లను మాలో చేర్చడం అన్యాయం

ఆర్‌డీఎంఏకు వినతి పత్రం సమర్పించిన బల్దియా ఉద్యోగులు



ఆర్‌డీఏంఎ షాహిద్‌మసూద్‌ను కలిసిన బల్దియా సిబ్బంది

వరంగల్ కార్పొరేషన్, జూలై 3: ఇటీవల వీఆర్ఏలు, వీఆర్ఏలుగా పని చేసిన వారిని మునిసిపల్ శాఖతో పాటు వివిధ ప్రభుత్వ విభాగాలలో నింపిన విషయం తెలిసిందే. కాగా, వీరి గత రెవెన్యూ విభాగం సీనియారిటీని లెక్కలోకి తీసుకోకుండా తమ ప్రస్తుత మునిసిపాలిటీ రూల్స్‌లో కలిసి సీనియారిటీ లిస్టులో కలపడం వల్ల తమకు చాలా అన్యాయం జరుగుతుందని వరంగల్ బల్దియా కార్యాలయంతో పాటు సర్కిల్ కార్యాలయాల ఉద్యోగులు తీవ్రంగా ఖండిస్తున్నారు. దీనిపై బుధవారం హనుమకొండ కుడా కార్యాలయంలోని వరంగల్ రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ షాహిద్ మసూద్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. కొత్తగా వచ్చిన వార్డు ఆఫీసర్లను తమతో చేర్చడం వల్ల తమ సీనియారిటీ వెనక్కి తగ్గిపోయి ఆలస్యంగా పదోన్నతి పొందే ప్రమాదం ఉందని చెప్పుకొచ్చారు. అంతే కాకుండా బల్దియాలో డిగ్రీలు, పీజీలు చేసిన వ్యక్తులు జూనియర్ అసిస్టెంట్లు, మినిస్టీరియల్ స్టాఫ్‌గా పని చేస్తుండగా ఎస్ఎస్‌సీ చదివి వీఆర్ఏలు, వీఆర్‌వోలుగా వచ్చి చేరిన వారిని తమతో చేర్చయడం అన్యాయం అని వినతిలో పేర్కొన్నారు. తమకు జరుగుతున్న అన్యాయంపై అధికారులు స్పందించాలని, దీనిపై రాష్ట్ర అధికారులను కలిసి విన్నవిస్తామన్నారు. అంతేకాకుండా కోర్టును ఆశ్రయించి సమస్య పరిష్కారానికి ముందుకు వెళతామన్నారు. ఆర్‌డీఎంఏను కలిసిన వారిలో జాక్ నాయకులు బొట్ల రమేష్, రాజారపు భాస్కర్‌లతో పాటు సుమారు 30 మంది సిబ్బంది ఉన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

బాలసముద్రం, జూలై 3: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరివేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యూశాయంపేటకు చెందిన సత్తు శ్రీధర్ (40) క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. మంగళవారం తన భార్య ఇంటి ఎదుట పని చేసుకుంటుండగా ఇంట్లో బెడ్‌రూంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు శ్రీధర్ భార్య రాధిక, తండ్రి వీరస్వామి ఆటోలో ఎంజీఎంకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సుబేదారి పోలీసులు తెలిపారు. మృతుడు శ్రీధర్‌కు భార్య రాధిక, ఇద్దరు కుమారులు ఉన్నారు.



సీపీ అంబర్ కిషోర్ ఝాను కలిసిన ఇన్‌స్పెక్టర్లు సువర్ణ, రామకృష్ణ

సీపీని కలిసిన ఇన్‌స్పెక్టర్లు

వరంగల్ క్రైం, జూలై 3: కమిషనరేట్ పరిధిలోని పలు స్టేషన్‌లలో బాధ్యతలు చేపట్టిన ఇన్‌స్పెక్టర్లు.. బుధవారం కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను మర్యాద పూర్వకంగా కలిశారు. వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, సుబేదారి మహిళా పోలీస్‌స్టేషన్ సువర్ణ, పరకాల, గీసుగొండ, ఆత్మకూరు క్రాంతికుమార్, బాబులాల్, సంతోష్ మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు చేపట్టిన సీఐలను కమిషనర్ అభినందించారు.

బాలల సంరక్షణ సామాజిక బాధ్యతగా గుర్తించాలి

బాలల సంరక్షణకు సామాజిక బాధ్యతగా గుర్తించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. ఆపరేషన్ ముస్కాన్ 10వ విడత పోస్టర్స్‌ను సీపీ బుధవారం కమిషనరేట్ కార్యాలయంలో ఆవిష్కరించారు. బాల కార్మికులతో పాటు వేధింపులకు గురవుతున్న బాలలను గుర్తించి వారి ఉజ్వల భవిష్యత్‌కు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రవికుమార్, హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల బాలల సంరక్షణ సమితి చైర్‌పర్సన్స్ దామోదర్, వసుధ, ఉప్పలయ్య, బాలల పరిరక్షణ అధికారులు ప్రవీణ్, రాజు, రవికాంత్, చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్స్, ఎన్జీవో ప్రతినిధులు, ఏహెచ్‌టీయూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి 17 వరకు అయోధ్య, కాశీ పుణ్యక్షేత్ర యాత్ర

గిర్మాజీపేట, జూలై 3: భారత రైల్వే క్యాటరింగ్, టూరిజం కార్పొరేషన్ భారత్ గౌరవ్ పర్యాటక రైలు ఈనెల 9 నుంచి 17వ తేదీ వరకు అయోధ్య కాశీ పుణ్యక్షేత్ర యాత్ర నిర్వహిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ సికింద్రాబాద్ జోనల్ గ్రూపు జనరల్ మేనేజర్ పి.రాజ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అయోధ్య, కాశీ పుణ్యక్షేత్ర యాత్రలో భాగంగా గయాలోని విష్ణుపాదం దేవాలయం, వారణాసిలోని కాశీ విశాలాక్షి, విశ్వనాథ, అన్నపూర్ణ దేవాలయాలు, గంగా హారతి, సారనాథ్ కట్టడాల సందర్శన, అయోధ్య రామ్ జన్మభూమి, హనుమాన్ గర్హి, సరయూ నది హారతి, ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణి సంగమం, మనుమాన్ మందిర్, శంకర్ విమాన మండపం సందర్శన ఉంటుందని తెలిపారు. ఈ పుణ్యయాత్ర 8 రాత్రులు, 9 పగళ్లుగా కొనసాగుతుందని, రోజూ ఉదయం అల్పాహారం, టీ, మధ్యాహ్నం, రాత్రి శాకాహార భోజనంతో పాటు పుణ్యయాత్ర ప్రయాణికులకు జీవిత బీమా సదుపాయం, స్నేహపూరిత, వృత్తిపర గైడ్‌ల సేవలు ఉంటాయని, ఐఆర్‌సీటీసీ మేనేజర్ ఈ రైలులో ఉంటారని అన్నారు. ఈ పుణ్యయాత్ర చార్జీలు ఒక్కొక్కరికి స్లీపర్ రూ. 15,510, మూడవ ఏసీ తరగతి రూ.24,300, రెండవ తరగతి ఏసీ రూ. 31,500 ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అలాగే 5 నుంచి 11 యేళ్లలోపు పిల్లలు ఒక్కొక్కరికి స్లీపర్‌కు రూ.14,140, 3వ తరగతి ఏసీ రూ.23,110, 2వ తరగతి ఏసీ రూ.30,080 ఉంటుందని ఆయా తరగతిల వారీగా నివాస సదుపాయం ఉంటుందని తెలిపారు. ఈ పుణ్యయాత్రకు వెళ్ల ప్రయాణికులు టికెట్ బుకింగ్, పూర్తి వివరాల కోసం ఐఆర్‌సీటీసీ ఫోన్ నంబర్లు 9701360701, 9281495845, 9281495843, 8287932228, 8287932229 లలో సంప్రదించాలని ఐఆర్‌సీటీసీ అధికారి రాజ్‌కుమార్ కోరారు.

దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో 11 మంది డీబార్

కేయూ క్యాంపస్, జూలై 3: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర దూరవిద్య డిగ్రీ కోర్సుల పరీక్షల్లో చూచిరాతలకు పాల్పడగా పరీక్షల తనిఖీ అధికారులు 11మంది విద్యార్థులను పట్టుకుని డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్.నరేందర్ బుధవారం తెలిపారు. డీబారైన వారిలో మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరూ. ఏబీవీ డిగ్రీ కళాశాల జనగామ 6గురు, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మరో ముగ్గురు ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే పరీక్షల నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఒలింపియాడ్‌లో అనికేత్‌కు గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న అనికేత్

కాజీపేట, జూలై 3: ఇటర్నేషనల్ ఇంగ్లీష్ ఒలంపియాడ్‌లో ఫాతిమాగనర్ బిషప్ బెరెట్టా స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న అనికేత్‌కు గోల్డ్ మెడల్ లభించింది. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయప్రతాప్‌రెడ్డి బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అనికేత్‌కు గోల్డ్‌మెడల్, సర్టిఫికెట్ అందజేశారు. సిల్వర్ జోన్ ఒలంపియాడ్ ఆధ్వర్యంలో 2023 - 24 సంవత్సరానికిగాను నిర్వహించిన పరీక్షలో అనికేత్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఇద్దరు రైతుల ఉసురు తీసిన అప్పులు

పెంబి రూరల్, బొంరాస్‌పేట్, జూలై 3: పంటల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. నిర్మల్ జిల్లా పెంబి మండలం యాపల్‌గూడ గ్రామానికి చెందిన రైతు అర్క సంతోష్ (28) తనకున్న ఎకరంతో పాటు నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంట వేశాడు. ఇందుకోసం రూ.లక్షల్లో అప్పు చేశాడు. పత్తి విత్తనా లు మొలకెత్తకపోవడంతో పాటు చేసిన అప్పులు తీర్చాలని బాకీలు ఇచ్చిన వారు వేధించడంతో మనస్తాపానికి గురై మంగళవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్ జిల్లా మెట్లకుంట గ్రామానికి చెందిన బైరం నర్సింహులు(62)కు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వారి వివాహాల కోసం చేసిన అప్పులు తీర్చేందుకు తనకు ఉన్న రెండు ఎకరాల పొలంలో ఎకరన్న సీలింగ్ భూమిని అమ్మకానికి పెట్టగా కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో బుధవారం ఉరేసుకున్నాడు.

ఉస్మానియా ఆస్పత్రిలో విద్యుత్ అంతరాయం

మంగళ్‌హాట్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలో బుధవారం మధ్యాహ్నం విద్యుత్ నిలిచిపోవడంతో రోగులు, వైద్యులు ఉక్కిరిబిక్కిరయ్యారు. శస్త్రచికిత్సలు చేసే సమయంలో అంతరాయం కలగడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ నిలిచిన వెంటనే ప్రారంభం కావాల్సిన జనరేటర్లు సైతం మొరాయించాయి. సిబ్బంది వెంటనే విద్యుత్ విభాగం నిపుణులను రప్పించి అరగంట తర్వాత సేవలను పునరుద్ధరించారు. దీంతో అప్పటివరకు సెల్‌ఫోన్, టార్చ్‌లైట్ల వెలుతురులోనే శస్త్రచికిత్సలను కొనసాగించినట్లు సమాచారం.

కుటుంబాన్ని మింగేసిన మద్యం రాకాసి

మద్యానికి బానిసైన భర్త వేధింపులు తాళలేక ముగ్గురు కుమార్తెలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ తల్లీ, ఓ కూతురు మృతి.. ఇద్దరి పరిస్థితి విషమం

కాగజ్‌నగర్, జూలై 3: ఐదుగురు ఆడపిల్లల తండ్రి అయిన ఓ వ్యక్తి బాధ్యతలు మరచి మద్యానికి బానిసై వేధింపులకు గురి చేస్తుండడంతో జీవితంపై విరక్తి చెంది అతని భార్యాబిడ్డలు ఆత్మహత్యకు యత్నించారు. భార్య, ఓ కుమార్తె మరణించగా మరో ఇద్దరు కూతుళ్ల పరిస్థితి విషమంగా ఉంది. ఇలా కుమరం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలం గజ్జిగూడ గ్రామానికి చెందిన ఓ కుటుంబాన్ని మద్యం మింగేసింది. వివరాలిలా ఉన్నాయి. గజ్జిగూడకు చెందిన ప్రతాప్‌కు భార్య అనిత(55), ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద కూతురికి వివాహమవ్వగా లక్ష్మి (21), రవళి(18), రమ్య(16), ఐశ్వర్య(14) ఇంటి వద్దే ఉంటున్నారు. మద్యానికి బానిసైన ప్రతాప్ తాగిన మైకంలో గ్రామస్థులతో నిత్యం గొడవలు పడుతుండేవాడు. ఆర్థిక ఇబ్బందులతో తమకున్న వ్యవసాయ భూమిలో కొంత భాగాన్ని అమ్మేశాడు. మిగిలిన కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ అనిత కుటుంబాన్ని పోషించేది. ఈ క్రమంలో 15 రోజుల క్రితం పొలం వద్ద జరిగిన గొడవలో భాగంగా ప్రతాప్ ఓ వ్యక్తిపై గొడ్డలితో దాడి చేశాడు. దీంతో హత్యాయత్నం కేసులో ప్రతాప్ జైలుకెళ్లాడు. అయితే, గ్రామ ప్రజల సాయంతో ప్రతాప్‌కు బెయిల్ ఇప్పించిన అనిత భర్తను జైలు నుంచి బయటకు తీసుకొచ్చింది. ఆ తర్వాత కూడా ప్రతాప్ తీరుమారకపోవడంతో మద్యం మానేయాలంటూ అనిత సోమవారం గొడవపడింది. ఇందుకు ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రతాప్ భార్య అనితపై దాడి చేసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన అనిత.. కుమార్తెలు రమ్య, లక్ష్మీ, ఐశ్వర్య, రవళితో కలిసి పొలానికి వెళ్లి ఆత్మహత్య చేసుకుందామని చెప్పింది. రవళి మినహా తల్లీకూతుళ్లు అందరూ పురుగు మందు తాగేశారు. రవళి కేకలు విని అక్కడికి వచ్చిన చుట్టుపక్కల పొలాల్లోని వారు అనిత, ఆమె కుమార్తెలను ఆస్పత్రికి తరలించారు. అయితే, రెండ్రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనిత, రమ్య బుధవారం మృతి చెందారు. లక్ష్మి, ఐశ్వర్య పరిస్థితి విషమంగా ఉంది. మరోపక్క, ప్రతాప్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

'జికా'...వస్తోంది జాగ్రత్త

రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం.. మహారాష్ట్రలో పెరుగుతున్న కేసులతో ఆందోళన

- సంసిద్ధంగాలేని తెలంగాణ వైద్యశాఖ
- కనీస చర్యలూ తీసుకోని వైనం
- ఇప్పటికే రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల విజృంభణ



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలో జికా వైరస్ విజృంభిస్తోంది. రెండు రోజుల క్రితం పుణెలో ఒక్క రోజే ఆరు జికా వైరస్ వ్యాధి (జడ్‌వీడీ) కేసులు నమోదుకావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దీంతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం బుధవారం అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈమేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) డాక్టర్ అతుల్‌గోయల్ అడ్వైజరీ జారీ చేశారు. జికాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా గర్భిణులను స్ర్కీనింగ్ చేయాలని కేంద్రం కోరింది. జికా వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన గర్భిణుల్లో పిండం ఎదుగుదలను పర్యవేక్షించాలని సూచించింది. ప్రతి ఆస్పత్రిలో కచ్చితంగా ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని, ఆ అధికారి జికా వైరస్ వ్యాప్తికి కారణమయ్యే దోమల పెరుగుదల నివారణకు చర్యలు చేపట్టాలని కోరింది. జికా కేసులు నమోదైతే వెంటనే నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీవీబీడీసీ)కు రిపోర్టు చేయాలని, అనుమానిత నమూనాలను పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపాలని సూచించింది. అలాగే ఐసీఎంఆర్ ఆధ్వర్యంలోని వైరస్ పరిశోధనా కేంద్రాలకు కూడా శాంపిళ్లను పంపాలని ఆదేశించింది.

అప్రమత్తంగాలేని రాష్ట్ర వైద్యశాఖ..

మహారాష్ట్ర నుంచి తెలంగాణకు రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి మహమ్మారులు వచ్చినప్పుడు వాటిని నియంత్రించే బాధ్యత క్షేత్రస్థాయిలో ప్రజారోగ్య సంచాలకులకే ఉంటుంది. అయితే మన వద్ద ఇంతవరకు అందుకు సంబంధించిన కార్యాచరణేమీ కానరావడంలేదు. ఇప్పటికే రాష్ట్రంలో ఒకవైపు డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల విజృంభణ మొదలైంది. గత ఐదు నెలల్లో మలేరియా, డెంగ్యూ మరణాలు కూడా సంభవించాయి. పటిష్ఠ పర్యవేక్షణ లేకపోవడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో వీటిపై అవగాహన ఉన్న విభాగాధిపతి లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని వైద్యవర్గాలు చెబుతున్నాయి. అందుకే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దోమల ద్వారా వ్యాప్తి..

జికా వైరస్ అనేది దోమల ద్వారా సంక్రమించే ఫ్లేవి వైరస్. జికా ప్రధానంగా ఏడెస్ దోమల కాటు ద్వారా వ్యాపిస్తుంది. ఇదే దోమ కుడితే డెంగ్యూ, చికున్‌గున్యా, ఎల్లో ఫీవర్ వైరస్‌లు కూడా సోకుతాయి. జికా సోకితే సాధారణ లక్షణాలే ఉంటాయి. ఇవి 2-7 రోజులపాటు కనిపిస్తాయి. ముఖ్యంగా జ్వరం, దద్దుర్లు, కీళ్ల నొప్పి, కండ్లకలక (ఎరుపు కళ్లు), కండరాలు, తలనొప్పితో పాటు మరికొన్ని తీవ్రమైన సమస్యలు కలుగుతాయి. మైక్రోసెఫాలీ (పుట్టుక లోపం), గులియన్ బారే సిండ్రోమ్ (న్యూరోలాజికల్ డిజార్డర్), మెనింజైటిస్ (మెదడు, వెన్నెముక లైనింగ్ వాపు)లాంటి వాటికి కారణమౌతుంది.

నివారణ ఎలాగంటే..

దోమల వృద్ధిని నివారించడానికి ఇళ్లు, బహిరంగ ప్రదేశాల చుట్టూ నిలిచిన నీటిని తొలగించాలి. జికా కూడా లైంగికంగా సంక్రమించే అవకాశం ఉన్నందున సురక్షితమైన విధానాలను పాటించాలి. జికాకు నిర్దిష్ట చికిత్స లేదు, కానీ లక్షణాల ఆధారంగా చికిత్సను అందిస్తారు. జికా లక్షణాలు కనిపిస్తే వెంటనే సరైన రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని డాక్టర్‌ను సంప్రదించాలి.

పిడుగుపాటు కాదు.. అంతర్గత లోపమే...

'భద్రాద్రి పవర్ ప్లాంట్' ప్రమాదంపై తేల్చిన జెన్‌కో..



దగ్ధమైన ట్రాన్స్‌ఫార్మర్

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ప్రమాదానికి అంతర్గత లోపాలే కారణమని తేలింది. పిడుగుపాటు వల్ల ప్రమాదం జరగలేదని జెన్‌కో స్పష్టం చేసింది. భద్రాద్రి పవర్ ప్లాంట్ ఒక్కోటి 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు (1080 మెగావాట్లు) ఉండగా.. అందులో 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్-1లోని జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ గత శనివారం అగ్నిప్రమాదం జరిగి కాలిపోయింది. అయితే దీనికి పిడుగుపాటే కారణమని తొలుత ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ జెన్‌కో అధికారులతో విచారణ జరిపించారు. పిడుగు పడిన సమయంలోనే యాదృచ్ఛికంగా జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ అంతర్గత లోపాలతో, దాని లోపల మంటలు ఉత్పన్నమయ్యాయని, ఇందుకు బాహ్య కారణాలు లేవని తేల్చారు. దీనిపై ప్రభుత్వానికి జెన్‌కో తాజాగా ఓ నివేదిక సమర్పించింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఓ వ్యవస్థ దెబ్బతిని.. ఆయిల్ లీకేజీ చోటుచేసుకుని పూర్తిగా దగ్ధమైందని అందులో అధికారులు వివరించారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.30 కోట్లకు పైగా నష్టం జరిగినట్టు ఇప్పటికే ఓ నిర్ధారణకు వచ్చారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్‌ను పూర్తిగా విప్పి పరిశీలించిన తర్వాత నష్టంపై పూర్తి స్పష్టత రానుందని ప్రభుత్వానికి జెన్‌కో నివేదించింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో అంతర్గత లోపాలు ఏర్పడడానికి నిర్మాణ, నిర్వహణ, పర్యవేక్షణ లోపాలు కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, జూలై 3: కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద ఉధృతి కొనసాగుతోంది. మంగళవారం బ్యారేజీలోకి 14,050 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా బుధవారం అంతే ఇన్‌ఫ్లో వస్తున్నట్లు అధికారులు తెలిపారు. బ్యారేజీలోకి గేట్లన్నీ తెరిచే ఉంచిన అధికారులు వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు విడుదల చేస్తున్నారు.

అన్నారంలో పరీక్షలు

మహదేవపూర్, జూలై 3: కాళేశ్వరం ప్రాజెక్టులోని సరస్వతీ (అన్నారం) బ్యారేజీలో పూణెకు చెందిన నిపుణుల బృందం ప్యారలర్ సెర్సింగ్ మెథడ్‌లో చేపట్టిన పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం నాటికి ఇవి 13వ రోజులకు చేరాయి. మొత్తం 42 ప్రాంతాల్లో ఈ టెస్టులు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు పది చోట్లలో మాత్రమే పూర్తయ్యాయని సమాచారం. వర్షాల కారణంగా పరీక్షలకు ఆటంకం కలుగుతోందని తెలుస్తోంది.



సిద్దిపేట జిల్లా రాయపోల్‌లో గుర్తించిన సిడితల వీరగల్లు

తల నరుక్కొంటే.. శివ సన్నిధికి చేరుకుంటామని..

- చాళుక్యులు, రాష్ట్రకూటుల కాలంలో శైవుల్లో ఈ విశ్వాసం
- 'సిరితల వీరగల్లు'గా ప్రశస్తి.. సిద్దిపేట జిల్లా రాయల్‌పోల్‌లో విగ్రహం లభ్యం

రాయపోల్, జూలై 3: ప్రాణార్పన చేస్తే దేవుడి సన్నిధికి చేరుకుంటామని నమ్మడం.. ఓ పదునైన ఆయుధంతో తమ తలను తామే నరుక్కోవడమో.. మరొకరితో నరికించుకోవడమో చేయడం గురించి విన్నారా? 6వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం వరకు నడిచిన చాళుక్యుల కాలంలో, అప్పట్లోనే రాష్ట్రకూటుల హయాంలో శైవభక్తుల్లో ఈ విశ్వాసం ఉండేదట! భాసింపట్టు వేసుకున్న స్థితిలో తలపైన ఉన్న జుట్టు సాయంతో తాటిచెట్టుకో.. వెదురు చెట్టుకో వేలాడుతున్న వ్యక్తితో ఉన్న ఆ శిల్పాన్ని చూస్తున్నారా? ఆ వ్యక్తి చేతులు ముకుళితమై ఉన్నాయి. తల నుంచి మొండెం వేరయినట్లుగా మధ్యలో గ్యాప్‌ను స్పష్టంగా గమనించొచ్చు! ఈ శిల్పాన్ని 'సిడితల వీరగల్లు' అంటారు. శైవభక్తులు ఆత్మబలిదానాలను ధర్మకార్యంగా భావించేవారు. శివసన్నిధికి చేర్చే తక్షణ మార్గంగా ఆత్మబలిదానాలను ఎంచుకునేవారు. పైగా తల నరుక్కొని మరణిస్తే, తమ ప్రాణాలను తీసుకెళ్లేందుకు దేవాంగనలు వస్తారని విశ్వసించేవారు. ఈ శిల్పంలో.. పైన ఇద్దరు మహిళలుండటాన్ని గమనించవచ్చు! ఫొటోలో కనిపిస్తున్న ఈ 'సిడితల వీరగల్లు' సిద్దిపేట జిల్లా రాయపోల్‌లోని పురాతన గణపతి ఆలయం ప్రాంగణంలోనిది. దీన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ గుర్తించి.. వివరించారు. మహిళా సిడితల వీరగల్లులు జనగామ జిల్లా లింగపల్లిలో లభించాయి. పురుష సిడితల వీరగల్లులు ఇప్పటి దాకా యాదాద్రి జిల్లా చొల్లేరులో, వనపర్తి జిల్లా కేంద్రంలో లభించగా రాయపోల్‌లోనిది మూడోది. ఇక సిడితల వీరగల్లులు కాకుండా కేవలం వీరగల్లులూ ఉంటాయి. తోటి ప్రజలను, పాడిపశువులను కాపాడే క్రమంలో అడవి జంతువులతో పోరాడి చనిపోతే, యుద్ధాల్లో పాల్గొని ప్రాణాలు కోల్పోతే వారిని వీరగల్లుగా చెక్కి ప్రజలు ఆరాధించేవారు.

పెంటారెడ్డి పదవీకాలం ఆర్నెల్లు పొడిగింపు

నీటిపారుదలశాఖలో ఎత్తిపోతల పథకాల సలహాదారుడు కె.పెంటారెడ్డి పదవీ కాలాన్ని మరో ఆర్నెల్లపాటు పొడిగిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెంటారెడ్డి పదవీకాలం పొడిగింపు నిర్ణయం మే 16 నుంచి ఆరునెలల పాటు అమలులో ఉండనుంది.

క్రీడల అభివృద్ధికి స్పోర్ట్స్ అథారిటీ విశేష కృషి

ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అజీజ్ ఖాన్

సందడిగా ప్రారంభమైన ప్రాంతీయ క్రీడా వసతి గృహ ప్రవేశ ఎంపికలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అజీజ్‌ఖాన్

వరంగల్ స్పోర్ట్స్, జూలై 3: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యువతలో అంతర్లీనంగా దాగిఉన్న క్రీడా ప్రతిభను గుర్తిస్తూ, వారిని క్రీడా రంగంలో ప్రోత్సహించడంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) విశేషంగా కృషి చేస్తోందని ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అజీజ్‌ఖాన్ స్పష్టం చేశారు. సాట్ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో నిర్వహిస్తున్న ప్రాంతీయ క్రీడా వసతి గృహంలో ప్రవేశాల కోసం జేఎన్ఎస్‌లో ఏర్పాటు చేసిన ఎంపిక పోటీలను అజీజ్‌ఖాన్ ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాంతీయ క్రీడా వసతి గృహంలో అర్హత సాధించిన క్రీడాకారులు అనుభవజ్ఞులైన కోచ్‌ల పర్యవేక్షణలో తర్ఫీదులు పొందడం ద్వారా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో రాణిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రాంతీయ క్రీడా వసతి గృహంలో మౌలిక వసతి, పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం అందించడంతో పాటు శాస్త్రీయ పద్ధతుల్లో శిక్షణ అందిస్తామన్నారు. క్రీడారంగంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఇక్కడి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జిల్లాకు కీర్తిప్రతిష్టలు తీసువచ్చిన ఘనత మన జిల్లాకు చెందిన క్రీడాకారులు ఉందని, ఈతరం క్రీడాకారులు అదే సంప్రదాయాన్ని కొనసాగించాలని హితవు పలికారు. క్రీడాకారులను ప్రోత్సహించడంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందన్నారు.

డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్‌బాల్, రెజ్లింగ్, స్విమ్మింగ్‌లో తొలి రోజు వివిధ క్రీడాంశాలలో బ్యాటరీ పద్ధతిన నిర్వహించిన ఎంపికలో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 200 మంది బాలబాలికలు పాల్గొన్నారన్నారు. క్రీడా వసతి గృహంలో నిష్ణాతులైన కోచ్‌ల పర్యవేక్షణలో ప్రణాళికబద్ధంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అదే విధంగా ఖమ్మం జిల్లాలోని అథ్లెటిక్స్ క్రీడా వసతి గృహంలో ప్రవేశాల కోసం జేఎన్ఎస్‌లో వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులకు ఎంపిక పోటీలను నిర్వహించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. క్రీడా వసతి గృహ ప్రవేశాల ఎంపికలు రెండు రోజుల పాటు నిర్వహించనున్న నేపథ్యంలో తొలి రోజు వివిధ జిల్లాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని, అదే విధంగా గురువారం నిర్వహించనున్న ఎంపిక పోటీలలో ఔత్సాహికులైన విద్యార్థులు పాల్గొనవచ్చునన్నారు.

ఈ కార్యక్రమంలో సాట్ కోచ్‌లు ఎం.డి.గౌస్, ఎస్.స్వర్ణలత, ఎం.రవికుమార్, కె.నర్సింగ్‌రావు, రాజేష్, సుధాకర్, సంతోష్‌చారి, ఆయుష్‌యాదవ్, డీఎస్‌ఏ కోచ్‌లు నరేందర్, శ్రీమన్నారాయణ, విష్ణువర్ధన్, రాయబారపు నవీన్, కె.రాజు, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు పోగుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కడవెండి తిరుగుబాటుకు 78ఏళ్లు

దొర గడీలను గడగడలాడించిన యోధుడు దొడ్డి కొమురయ్య ● నేడు కొమురయ్య 78వ వర్ధంతి

దేవరుప్పుల, జూలై 3 : భూమికోసం.. భుక్తికోసం.. బానిస బంధనాల విముక్తి కోసం.. వెట్టిచాకిరీ నిర్మూలన కోసం నడుం బిగించి తెలంగాణ గడ్డపై నేలకొరిగిన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య. నైజాం సర్కార్ దేశ్‌ముఖ్‌ల కుట్రలతో చిందిన కొమురయ్య రక్తంతో తెలంగాణ రక్త సిక్తమైంది. బాంచెన్‌దొరా అంటూ దొర పెత్తనంలో నలిగిన వాళ్లను బందూకులు చేతబట్టి పోరాడే దిశగా నడిపించిన ధీరుడు దొడ్డి కొమురయ్య. నాడు రజాకార్ల చర్యలను ఎదురొడ్డి పోరాడారు. నాడు దేశ్‌ముఖ్‌ల చర్యలను నిలదీస్తూ వారికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న కొమురయ్యను దేశ్‌ముఖ్‌ల గూండాలు కాల్చి చంపి గురువారానికి 78ఏళ్లు నిండాయి. ఈ కొమురయ్య స్వగ్రామమైన కడవెండిలో వర్ధంతిని నిర్వహించనున్నారు. ఈక్రమంలో తెలంగాణ ప్రాంత తొలి అమరుడు దొడ్డి కొమురయ్య చరిత్రను నేటి తరం తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి గ్రామంలో 1928వ సంవత్సరంలో దొడ్డి గట్టమ్మ, కొండయ్యల దంపతులకు జన్మించిన కొమురయ్యకు 16వ ఏటా 1944లో కొమురమ్మతో వివాహం జరిగింది. ఈ సమయంలో పాలకుర్తి మండలం విస్నూర్ గ్రామాన్ని కేంద్రంగా చేసుకొని 60 గ్రామాలను దేశ్‌ముఖ్ రాపాక వెంకట రాంచంద్రారెడ్డి, ఆయన భార్య జానమ్మ దొరసాని, కుమారుడు బాబుదొర ప్రజలతో వెట్టిచాకిరీ చేయించుకుంటూ అన్నిరకాలుగా పీడించేవారు. ప్రజల మాన ప్రాణాలతో చెలగాటమాడేవారు. 1943వ సంవత్సరంలో జరిగిన ఆంధ్ర మహాసభలో వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించుకున్నారు. కడవెండి గ్రామానికి చెందిన నల్ల నర్సింహులు, దొడ్డి మల్లయ్య, దావిద్‌రెడ్డి, వడ్డెనర్సయ్య, నల్ల కొండయ్య, మచ్చ రామయ్య, జంపాల లింగయ్య, పంతం లచ్చయ్య, పాముకుంట్ల ముత్తిలింగం, మాశెట్టి రాంచెంద్రయ్య, ఎర్రంరెడ్డి రాంక్రిష్టారెడ్డి, పైండ్లయాదగిరి తదితరులు నైజాం సర్కారుకు వ్యతిరేకంగా ఉద్యమానికి ఈ ప్రాంతం నుంచి సహకరించారు. 1946లో నైజాం సర్కార్‌కు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ పోరాటం ప్రారంభమైంది. గ్రామరక్షక దళాల పేరుతో ఆనాడు గుత్పల సంఘాలను ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో విస్నూర్ ప్రాంత గ్రామాలతో పాటు కడవెండి గ్రామంలో దేశ్‌ముఖ్ అనుచరుల ఆగడాలకు వ్యతిరేకంగా 1946 జూలై 3న ఉద్యమకారులతో గ్రామ ప్రజలు సమావేశమయ్యారు. జూలై 4న విస్నూర్ దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డి చర్యలకు నిరసనగా కడవెండి గ్రామ ప్రజలు అస్నాల రాజన్న ఇంటి ఎదుట నుంచి ఊరేగింపుగా బొడ్రాయి వద్దకు వస్తున్న సమయంలో దక్షిణం వైపు ఉన్న ఇంట్లోనుంచి దేశ్‌ముఖ్ గుండాలు తూటాల వర్షం కురిపించారు. ఊరేగింపులో ముందు వరుసలో ఉన్న దొడ్డికొమురయ్య, దొడ్డి మల్లయ్యకు తూటాలు తగిలాయి. కొమురయ్య పొట్టలోకి ఎక్కువ తూటాలు దూసుకు పోవటంతో రాత్రి పది గంటల సమయంలో నేల కొరిగి అమరుడయ్యాడు. కొమురయ్య సోదరుడు దొడ్డి మల్లయ్య ప్రాణాపాయస్థితినుంచి బయట పడ్డాడు. దొడ్డికొమురయ్య వీర మరణంతో తెలంగాణ ప్రాంత మంతా ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగశాయి. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో రక్తాన్ని చిందించి నేలకొరిగిన తొలి అమర వీరుడిగా కొమురయ్య పేరు, ఊరు చరిత్ర పుటల్లో నిలిచి పోయింది. దొడ్డికొమురయ్య అమరుడైన నాటినుంచి నేటి వరకు కడవెండి గ్రామంలో ఆయన స్మారక స్థూపం వద్ద వర్ధంతి సభలను విప్లవ, కమ్యూనిస్టు పార్టీలు నిర్వహిస్తూనే ఉన్నాయి. 50వ వర్ధంతి సభను సీపీఐ ఆధ్వర్యంలో 1996లో పెద్ద ఎత్తున నిర్వహించారు. దొడ్డి కొమురయ్య స్మారక భవనం నిర్మిస్తామని సీపీఐ హామీ ఇచ్చి నెరవేర్చింది. ఆయన పేరిట స్మారక భవనం నిర్మించుకోగా పలు కార్యక్రమాలకు ఉపయోగంలోకి వచ్చింది.

దొడ్డి కొమురయ్య వర్ధంతిని విజయవంతం చేయండి

సీపీఎం, సీపీఐ(ఎం-ఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం కడవెండిలో నిర్వహించే తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు సింగారపు రమేష్, సీపీఐ(ఎం-ఎల్) మాస్‌లైన్(ప్రజాపంథా) పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు గడ్డం సదానందం, సీపీఐ మండల కార్యదర్శి జీడి ఎల్లయ్య కోరారు. కొమురయ్య వర్ధంతి కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



కడవెండిలోని దొడ్డి కొమురయ్య స్మారకస్థూపం

దొడ్డికొమురయ్య (ఊహా చిత్రం)

కేసముద్రం మీదుగా వేములవాడ, భద్రాచలానికి ఎక్స్‌ప్రెస్ సర్వీసులు

మహబూబాబాద్ డిపో మేనేజర్ శివప్రసాద్



కేసముద్రం మీదుగా వేములవాడ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, జూలై 3: మహబూబాబాద్ జిల్లా కేంద్రం నుంచి కేసముద్రం మీదుగా వేములవాడకు, హనుమకొండ నుంచి కేసముద్రం మీదుగా భద్రాచలం పుణ్యక్షేత్రాలకు రెండు నూతన ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను ప్రారంభించినట్లు స్థానిక డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ తెలిపారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలకేంద్రంలో సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ డి.విజయ భాను చేతుల మీదుగా ఈ సర్వీసులను ప్రారంభించినట్లు వివరించారు. మహబూబాబాద్ నుంచి వేములవాడకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సు స్థానిక డిపో నుంచి ఉదయం 6.15 గంటలకు బయలుదేరి కేసముద్రంకు చేరుకుని అక్కడి నుంచి ఉదయం 7 గంటలకు బయలుదేరి నెక్కొండ, వరంగల్, కరీంనగర్ మీదుగా ఉదయం 11.30 గంటలకు వేములవాడకు చేరుకుంటుందని తెలిపారు. తిరిగి అక్కడి నుంచి మధ్యాహ్నం 12 గంటలకు మానుకోటకు బస్సు బయలుదేరుతుందని వరంగల్, నెక్కొండ, కేసముద్రం మీదుగా సాయంత్రం 5.30 గంటలకు మానుకోటకు చేరుకుంటుందన్నారు. మహబూబాబాద్ నుంచి వేములవాడకు టిక్కెట్ ధర రూ.250, కేసముద్రం నుంచి రూ.230, నెక్కొండ నుంచి రూ.200 టిక్కెట్ ధర ఉంటుందన్నారు.

హనుమకొండ నుంచి భద్రాచలం సర్వీస్ ఇలా..

హనుమకొండ నుంచి భద్రాచలం వెళ్లే బస్సు అక్కడ నుంచి ఉదయం 8.15 గంటలకు బయలు దేరి, నెక్కొండ మీదుగా కేసముద్రంకు 9.40 గంటలకు చేరుకుంటుందని ఆర్టీసీ డీఎం శివప్రసాద్ తెలిపారు. కేసముద్రం నుంచి మహబూబాబాద్ జిల్లా కేంద్రం మీదుగా మధ్యాహ్నం 1.30 గంటలకు భద్రాచలానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. తిరిగి భద్రాచలం నుంచి మధ్యాహ్నం 2 గంటలకు బస్సు బయలుదేరుతుందని తెలిపారు. హనుమకొండ నుంచి భద్రాచలానికి టిక్కెట్ ధర రూ.270, నెక్కొండ నుంచి రూ.220, కేసముద్రం నుంచి భద్రాచలానికి రూ.190 టిక్కెట్ ధర ఉంటుందని వివరించారు. ఈ సదవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపుపై ఆందోళన వద్దు

అధికారిక వెబ్‌సైట్‌లోని ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా చెల్లించొచ్చు

బిల్లుల చెల్లింపు బీబీపీఎస్‌లోకి కొనసాగుతున్న 'ఆన్‌బోర్డింగ్'

ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి



హనుమకొండ టౌన్, జూలై 3: విద్యుత్ చెల్లింపులపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. థర్డ్ పార్టీ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించొద్దని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రకటించినప్పటి నుంచి వినియోగదారుల్లో ఆందోళన మొదలైంది. కొంతమంది ఆన్‌లైన్ చెల్లింపులకు ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం యాప్‌లను ఆశ్రయిస్తుంటే 'టెక్నికల్ ఇష్యూ' అని వచ్చి బిల్లు చెల్లింపు జరగడం లేదు. ఈ విషయాన్ని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి దృష్టికి బుధవారం తీసుకెళ్లగా ఆయన స్పందించారు. భారత్ బిల్ పేమెంట్ సిస్టం (బీబీపీఎస్)లో బిల్లులు చెల్లించేందుకు ఆన్‌బోర్డింగ్ ప్రక్రియ కొనసాగుతోందని, అతి త్వరలోనే క్రమబద్ధీకరించబడుతుందన్నారు. ప్రస్తుతం వినియోగదారులు టీజీ ఎన్పీడీసీఎల్ అధికారిక వెబ్‌సైట్‌లోని గూగుల్‌పే, ఫోన్‌పే పేమెంట్ ప్లాట్‌ఫారమ్‌ను ఎంచుకొని చెల్లింపులు చేయొచ్చన్నారు. లేదా టీజీ ఎన్పీడీసీఎల్ యాప్ ద్వారానైనా బిల్లు చెల్లించవచ్చన్నారు. క్రమబద్ధీకరణ తర్వాత పూర్తి వివరాలను వినియోగదారులకు అందుబాటులో ఉంచుతామన్నారు.

సబ్‌స్టేషన్లను రక్షణ బృందాలు తనిఖీ చేయాలి

ప్రతీ సబ్‌స్టేషన్‌ను విధిగా రక్షణ బృందాలు తనిఖీ చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి సూచించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి ఐదు జిల్లాల నోడల్ ఆఫీసర్లు, టెక్నికల్, ఎంఆర్‌టీ డీఈలతో బుధవారం సీఎండీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. సబ్‌స్టేషన్లతో పాటు ఎల్‌టీ, హెచ్‌టీ, సిటీ సర్వీసులను తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రతీ సర్కిల్‌లో ఒక మోడల్ ఎస్‌పీఎం షెడ్డును తీర్చిదిద్దాలన్నారు. హనుమకొండ ములుగురోడ్డులో పైలట్ ప్రాజెక్టుగా ఒక ఆధునాతమైన ఎస్‌పీఎం షెడ్డును ఏర్పాటు చేస్తున్నామన్నారు ప్రతీ సిబ్బందితో పెప్ టాక్ నిర్వహించాలన్నారు. రైతులకు, వినియోగదారులకు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించాలన్నారు. ఫిర్యాదులకు 18004250028 టోల్‌ఫ్రీ నెంబర్ లేదా 1912 సంప్రదించాలన్నారు. ఈ కార్య క్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్స్, సీజీఎంలు, జీఎంలు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు సన్మానం

గూడూరు, జూలై 3 : మండల పరిషత్, జిల్లాపరిషత్ ప్రజాప్రతినిధుల పదవీకాలం బుధవారంతో ముగిసింది. ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి ఎంపీపీ బానోత్ సుజాతమోతీలాల్, జడ్పీ కోఆప్షన్ సభ్యులు మహ్మద్ ఖాసీంలతో పాటు ఎంపీటీసీలను అధికారులు సన్మానించారు. సమావేశంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, ఎంపీటీసీలు కత్తిస్వామి, బోడ కిషన్, స్వాతిరవి, రమ మన్మోహన్‌రెడ్డి, కవితావెంకన్న, ప్రవళిక లింగేశ్వర్, కవిత భాస్కర్, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో వీరస్వామి, ఎంపీవో చంద్రమోహనస్వామి, సిబ్బంది ఇమామ్, నాగరాజు, ఏపీవో భస్సీలాల్ పాల్గొన్నారు.



ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న అధికారులు



ఎంపీపీ అరుణరాంబాబును సన్మానిస్తున్న రాంచంద్రునాయక్

ప్రజల మన్ననలను పొందాలి

- డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్
- ఎంపీపీ, ఎంపీటీసీల వీడ్కోలు సన్మాన సభ

మరిపెడ, జూలై3 : పదవులు శాశ్వతం కాదని, ప్రజల మన్ననలను పొందాలని డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. బుధవారం ఎంపీపీ, ఎంపీటీసీల సన్మాన సభ ఇన్‌చార్జ్ ఎంపీడీవో రామారావు అధ్యక్షతన జరుగగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగాహాజరై ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానించారు. జడ్పీటీసీ శారదరవీందర్, మునిసిపల్ చైర్‌పర్సన్ సింధూరకుమారిరవినాయక్, వైస్‌ఎంపీపీ అశోక్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు తాళ్లపల్లి రఘు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

నర్సింహులపేట, జూలై 3 : ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరించి ప్రజలకు సుస్థిర పాలనను అందించాల్సిన బాధ్యత గ్రామ ప్రత్యేక అధికారులకు ఉన్నదని డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. ఎంపీపీ టేకుల సుశీల అధ్యక్షతన బుధవారం మండలసర్వసభ్య సమావేశం జరిగింది. వ్యవసాయం, స్త్రీ, శిశు సంక్షేమం, విద్య, వైద్యం, విద్యుత్, ఇరిగేషన్, పీఆర్‌తోపాటు పలుశాఖలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎంపీపీ, వైస్ ఎంపీపీతో ఎంపీటీసీ సభ్యులను ఘనంగాసన్మానించారు. ఎంపీడీవో శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ రాముగౌడ్, తహసీల్దార్ నాగరాజు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



నర్సింహులపేట మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న రాంచంద్రునాయక్

'విద్యార్థులకు సరిపడా మధ్యాహ్న భోజనం ఇవ్వాలి'

దంతాలపల్లి, జూలై 3 : రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కడుపునిండా అందించాలని ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటిన అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. సీజనల్ సమస్యలు ప్రబలకుండా ఏజెన్సీలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో విద్యాబోధన చేయాలన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్ రావు, ఎంపీడీవో వివేక్రమ్, ఎంపీవో అప్పర పాష, ఎంఈవో రామునాయక్, ఎంపీటీసీ యాకయ్య, హెచ్‌ఎం వేణుమాధవ్ రెడ్డి, దాట్ల తాజామాజీ సర్పంచ్ కొమ్మినేని రవీందర్, ఎంపీటీసీలు హంజీద్రూనాయక్, సతీష్, సీనియర్ నాయకుడు పొన్నోటి బాలాజీ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

ప్రజల్లో ఉన్నవారికే గుర్తింపు

- పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి

పెద్దవంగర, జూలై 3 : పదవులు ఉన్నా, లేకున్నా ప్రజల్లో ఉన్న వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పదవీ కాలం పూర్తి చేసుకున్న ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎర్ర సబిత వెంకన్న, వైస్‌కల్పరాజుయాదవ్, ఎంపీటీసీలు విజయ, రవీందర్, అనురాధ, సౌజన్య, కాంగ్రెస్ నాయకులు నెహ్రూనాయక్, హమ్యానాయక్ ఉన్నారు.

ప్రజాసేవ చేయడం అభినందనీయం

- ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి



ఎంపీటీసీలకు సన్మానం చేస్తున్న అధికారులు

నెల్లికుదురు, జులై 3 : ఎంపీటీసీలకు నిధులు, విధులు లేకున్న ప్రజాసేవ చేయడం అభినందనీయమని ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి తెలిపారు. ఎంపీటీసీలకు పదవి కాలం ముగియడంతో బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే స్థానిక ఎన్నికల్లో పోటీ చేసి ప్రజాప్రతినిధులుగా మళ్లీ విధులు నిర్వర్తించాని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలరాజు, తహసీల్దార్ రాజు, ఏవో నెలకుర్తి రవీదర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జెల్ల వెంకటేష్, పొనుగోటి దేవేందర్‌రావు వివిధ గ్రామాల ఎంపీటీసీలు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై యువకుల దాడి

మహబూబాబాద్ రూరల్, జూలై 3 : మహబూబాబాద్ ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో కోరుట్ల డిపోకు చెందిన డ్రైవర్ బండి శ్రీనివాస్‌పై మానుకోట పట్టణానికి చెందిన ఓంప్రకాష్ అతని స్నేహితుడితో కలిసి దాడి చేసినట్టు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. బుధవారం కోరుట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్ మహబూబాబాద్ బస్‌స్టాండ్ మూలమలుపు తిరుగుతుండగా బస్‌స్టాండ్ నుంచి బయటకు ద్విచక్రవాహనంపై వస్తున్న ఓంప్రకాష్‌కు బస్ తగిలిందని ఆగ్రహించాడు. ఈ క్రమంలో ప్రకాష్ అతని స్నేహితుడితో కలిసి డ్రైవర్ శ్రీనివాస్‌పై దాడి చేసినట్లు సీఐ తెలిపారు. డ్రైవర్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ప్రకాష్, అతడి స్నేహితుడిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

కేసముద్రం, జూలై 3 : కేసముద్రం స్టేషన్ గిర్నితండా, అమీనాపురం, ఎన్టీఆర్ నగర్‌లలో బుధవారం రాష్ట్ర టాస్క్‌ఫోర్స్, గూడూరు ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పదిలీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకోగా 1100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎస్.భిక్షపతి తెలిపారు. దీనికి బాధ్యులైన నలుగురిపై కేసు, ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ సాయికిరణ్, ఎక్సైజ్ ఎస్ఐ రాజేశ్వరి పాల్గొన్నారు.

- మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలం బోడగుట్టతండాలో గుడుంబా స్థావరాలపై మహబూబాబాద్ రూరల్ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు బుధవారం తెల్లవారుజామున సంయుక్తంగాదాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ సర్వయ్య, ఎక్సైజ్ సీఐ చిరంజీవిలు మాట్లాడుతూ.. బోడగుట్టతండాలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి 33 లీటర్ల గుడుంబా, 800 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఎవరైనా గుడుంబా కాచీనా.. విక్రయించిన వారిపై కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్సైజ్ సీఐ నాగేశ్వర్‌రావు, రూరల్ ఎస్సై దీపికారెడ్డి, నీరజ, అశోక్, చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యేనా?

- ఇబ్బందులు పడుతున్న తొర్రూరు పట్టణ ప్రజలు
- నేడు మునిసిపల్ పాలకవర్గ సమావేశం
- హాజరుకానున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు, జూలై 3 : నూతనంగా ఏర్పడిన మునిసిపాలిటీల అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. ఆనిధులతో అభివృద్ధి పనులు చేపట్టినా మునిసిపాలిటీ పరిధిలో సమస్యలు అదేవిధంగా కొట్టుమిట్టాడుతున్నాయి. గత ప్రభుత్వంలో మంజూరైన నిధుల పనులు చేసేందుకు కూడా అధికారులు టెండర్లు పిలవక పోవడం, పిలిచిన టెండర్ల పనులు ప్రారంభించకపోవడం, ప్రజా ప్రతినిధుల ఒత్తిడి నేపథ్యంలో అభివృద్ధి పనులు జరగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పట్టణ అభివృద్ధిని ఆకాంక్షిస్తూ నేడు గురువారం మునిసిపాలిటీలోనిర్వహించే పాలకవర్గ సమావేశానికి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో సమస్యల పరిష్కారం అవుతాయని పట్టణ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. పట్టణంలో ప్రధానంగా డంపింగ్ యార్డు చెత్త తరలింపు సమస్య తీవ్రంగా ఉంది. దీంతో పాటు నిరుపయోగంగా ఎనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రం, ప్రకృతి వనాలు, నాన్‌వెజ్ మార్కెట్, ఆడిటోరియం, డ్రైనేజీలు, సీసీరోడ్ల సమస్య తీవ్రంగా ఉంది. ఈసమస్యలు పరిష్కారం అవుతాయా అని పట్టణ ప్రజలు ఆశిస్తున్నారు.



డంపింగ్ యార్డులో రోడ్ల వెంట చెత్తకుప్పలు

ప్రధాన సమస్యలు..

పట్టణంలో ప్రధానంగా ఏర్పడుతున్న సమస్య డ్రైనేజీలు. చెత్త తరలింపులో తీవ్ర జాప్యం ఏర్పడుతుంది. మునిసిపాలిటీ చెత్త తరలింపు కోసం ప్రభుత్వం సర్వే నంబర్ 110లో సంగడి బోడు వద్ద 14 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ప్రహరీ గోడ నిర్మాణం కోసం రూ.10లక్షల నిధులు మంజూరు చేసినా గోడ నిర్మించలేదు. మునిసిపల్ సిబ్బంది తరలించిన చెత్త కాల్చడంతో పక్కనే ఉన్న తండావాసులు శ్వాసకోసవ్యాధులు, అనారోగ్యంతో ఇబ్బందులు పడుతుండటంతో చెత్త తరలింపు నిలిపివేశారు. పట్టణంలో ప్రతి రోజు 25టన్నుల చెత్త సేకరించాల్సి వస్తుంది. చెత్త పోసేందుకు స్థలం లేకపోవడంతో 7 నెలలుగా పాడుబడిన బావులు, రోడ్ల వెంట, మునిసిపల్ కౌన్సిలర్ల వ్యవసాయ స్థలాల్లో పోస్తున్నారు. తడి, పొడి చెత్త వేరుచేసేందుకు డంపింగ్ యార్డు ఆవరణలో ఇమిగ్రేషన్ సెంటర్‌లు ఏర్పాటు చేసినా అవి నిరుపయోగంగా ఉన్నాయి. రోడ్లవెంట పోసిన చెత్తతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

తొర్రూరు పట్టణంలో అన్ని వార్డుల్లో పూర్తి స్థాయిలో సీసీరోడ్లు, డ్రైనేజీలు లేకపోవడం వల్ల కాలువల వెంట నీరు పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని, సమస్యల పరిష్కారం కోసం స్థానిక ఎమ్మెల్యే పరిష్కారం చూపాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

నేడు సొసైటీ మహాజన సభ

గూడూరు, జూలై 3 : గూడూరు సొసైటీ కార్యాలయంలో గురువారం మహాజన సభ నిర్వహిస్తున్నట్లు చైర్మన్ చల్లా లింగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రప్రభుత్వ ఆదేశాలనుసారం రైతుబంధు, రైతుభరోసాపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి వ్యవసాయశాఖ, సహకారశాఖ జిల్లాస్థాయి అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ప్రైవేటు స్కూల్ బస్సు నిలిపివేత

కేసముద్రం, జూలై 3 : నారాయణపురం శివారు మాతృతండాలో బుధవారం ప్రైవేటు స్కూల్ బస్సును విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు నిలిపివేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యఅందుతుందని, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు.

యూనిఫాంలను పంపిణీ చేయాలి

కేసముద్రం, జూలై3 : కేసముద్రం మార్కెట్లో లైసెన్సు కార్మికులకు యూనిఫాంలను పంపిణీ చేయాలనే డిమాండ్‌తో మార్కెట్ కార్యాలయం ఎదుట తెలంగాణ హమాలీ, మిల్‌వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారపు శ్రీధర్ ప్రత్యేక హోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు హామీతో ధర్నా విరమించారు. సంఘం బాధ్యులు బట్టమేకల రాజు, మిట్టగడుపుల వెంకన్న, మేకల రాజు, అల్లం వెంకన్న, లాలు, గుండెల సురేష్, కృష్ణ, ఉపేందర్ పాల్గొన్నారు.

మండలాలకు ప్రత్యేకాధికారుల నియామకం

మహబూబాబాద్ టౌన్, జూలై 3 : జిల్లాలో ఈనెల 3వ తేదీతో మండల పరిషత్ మండలాల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బయ్యారం, గార్ల మినహా మిగతా 14 మండలాలకు జిల్లాస్థాయి అధికారులను మండల ప్రత్యేకాధికారులుగా నియమించారు. చిన్నగూడూరు మండలానికి డీడబ్ల్యూవో ఆర్.వరలక్ష్మీ, దంతాలపల్లి మత్స్యశాఖ అధికారిణి నాగమణి, డోర్నకల్‌కు సర్వేల్యాండ్ రికార్డ్స్ ఎ.నర్సింహమూర్తి, గంగారంకు ఎస్సీ కార్పొరేషన్ ఏడీ ఆర్.బాలరాజు, గూడూరుకు డీటీడీవో ఎం.ఎర్రయ్య, మరిపెడకు ఏహెచ్‌ఏడీకృష్ణమూర్తి, కొత్తగూడ జి.డబ్ల్యూడీడీ సురేష్, కురవి బీసీడీవో ఎం.నర్సింహస్వామి, మహబూబాబాద్‌కు ఆర్డీవో అలివేలు, కేసముద్రంకు పశుసంవర్ధక శాఖ అధికారి సుధాకర్, నర్సింహుల పేటకు ఏడీఏలక్ష్మీనారాయణ, నెల్లికుదురుకు హార్టికల్చర్ అధికారి జె.మరియన్న, పెద్దవంగర డీసీవో ఎం.వెంకటేశ్వర్లు, తొర్రూరుకు ఆర్డీవో తొర్రూరు జి.నర్సింహారావును నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉక్కు పరిశ్రమను స్థాపించాలి : సీపీఐ

మహబూబాబాద్ టౌన్. జూలై3 : ఎన్ని నిర్బంధాలు ఎదురైనా, కేసులు పెట్టిన బయ్యారంలో ఉక్కు పరిశ్రమను స్థాపించేంతవరకు పోరాటంఆగదని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా కార్యదర్శి బి.విజయసారథి స్పష్టం చేశారు. బయ్యారం ఉక్కుసాధన ఉద్యమ కేసులో బుధవారం సీపీఐ, జేఏసీ నాయకులు మానుకోట కోర్టుకు హాజరయ్యారు. సీపీఐ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, మిర్యాల మల్లికార్జున్, జేఏసీనాయకులు శంతన్‌రామరాజు, గుంజె హన్మంతు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మహబూబాబాద్ రూరల్, జూలై 3 : జిల్లా కేంద్రంలోని పాత బజారులో గురువారం పలుకాలనీల్లో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయంఏర్పడనున్నట్లు టౌన్-1 ఏఈ సంగీత బుధవారం తెలిపారు. భవానిశంకర్‌తండా, మదర్‌థెరిస్సా కళాశాల, వ్యవసాయ మార్కెట్, శిఖార్‌ఖానాగడ్డ, సూర్య థియేటర్, మునిసిపల్ కార్యాలయం, అండర్‌బ్రిడ్జి రోడ్, స్టేషన్‌రోడ్డు, భవానినగర్‌తండ, రూరల్ పోలీస్‌స్టేషన్, హస్తీనాపురం కాలనీ, విశ్రాంతి భవనం, నందనాగార్డెన్, గోపాలపురం కాలనీ ఏరియాల్లో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించలని విజ్ఞప్తి చేశారు.

బాసర ట్రిపుల్ ఐటీలో 8 మంది మోడల్ స్కూల్ విద్యార్థులకు సీట్లు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై3 : బాసర ట్రిపుల్ ఐటీలో 8 మంది మహబూబాబాద్ మోడల్ స్కూల్ విద్యార్థులకు సీట్లు వచ్చినట్లు ప్రిన్సిపాల్ డి. అమరావతి బుధవారం తెలిపారు. మానుకోట మోడల్ స్కూల్‌లో 2023-24 విద్యాసంవత్సరం పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన కె.శ్రేయ, వి.లక్ష్మీ, సీహెచ్.కౌశిక్, పి.శివనాగరాజు, ఎమ్డీ షాదాబ్, పి.కీర్తన, సీహెచ్.కృష్ణకౌశిక్, ఎ.రామ్‌దీక్షిత్‌కు మొదటి విడతలో బాసర ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీట్లు వచ్చాయని తెలిపారు. రెండోవిడతలో కూడా మరికొంతమంది విద్యార్థులకు సీట్లు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయుల అభినందించారు.

నేడు విద్యాసంస్థల బంద్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 3 : నీట్ పరీక్షలు రద్దు చేయాలనే డిమాండ్‌తో మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా గురువారం ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్‌ను జయప్రదం చేయాలని నాయకులు పట్ల మధు, వెలుగు శ్రావణ్, పెరుమాండ్ల చరణ్‌గౌడ్, ఇరుగు మనోజ్ బానోత్ దేవేందర్, ప్రవీణ్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో బుధవారం నిర్వహించిన ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, టీజీఎస్, పీడీఎస్‌యూ, ఏఐవైఎఫ్ (ఐక్య విద్యార్థి సంఘాలు) సంఘాల సమావేశం నిర్వహించారు. గందసిరి జ్యోతిబసు, చంటి, మేకల వెంకటేష్, రాజేష్, వికాస్, శరత్, మనోజ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

'ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి'

కొత్తగూడ, జూలై 3 : ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి అభిమన్యు సూచించారు. మండంలోని పొగుళ్లపల్లిలో బుధవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ దేశిడి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన మహజన సభ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి అభిమన్యు రైతు భరోసాపై పలు సూచనలు సలహాలు రైతులకు వివరించారు. కాగా, 10 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు రైతుభరోస వర్తింపజేయాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో ఉదయ్, డైరెక్టర్లు చల్లా నారాయణరెడ్డి, సుంకరబోయిన మొగిలి, యాకయ్య, సమ్మయ్య, వజ్జ జంపయ్య, గజ్జి కొంరెల్లి, సీఈవో వెంకన్న, ఏఈవోలు రాజు, యశ్వంత్, రైతులు పాల్గొన్నారు.

సాగు చేసే వారికే రైతు భరోసా..

- ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

బయ్యారం, జూలై 3 : గత ప్రభుత్వానికి భిన్నంగా పంటసాగు చేస్తున్న నిజమైన రైతులకు రైతుభరోసా కిందపంట పెట్టుబడి సాయం అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు బయ్యారం సొసైటీ కార్యాలయంలో బుధవారం రైతు బంధు పథకంపై సలహాలు, సూచనల కొరకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హజరైన ఆయన మాట్లాడుతూ ఎవరైతే పంట సాగు చేస్తున్నారో ఆ రైతుకు మాత్రమే తప్పని సరిగా పంట పెట్టుబడి సాయం అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. అందులో భాగంగానే రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేపడుతున్న పేర్కొన్నారు. పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ అంగోత్ బిందు, డీసీవో వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శ్రీనివాస్, డీటి రవి కిరణ్‌తో పాటు సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

- ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య బయ్యారంలో పర్యటించారు. తొలుత నూతనంగా నిర్మించిన జగ్గుతండా గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగితెలుసుకున్నారు. తదనంతరం బయ్యారం బాలుర ఉన్నత పాఠశాల నందు జరిగిన వనమోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్, డీటీ రవి కిరణ్, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'నాణ్యమైన విద్య అందించాలి'

గంగారం, జూలై 3 : వసతి గృహంలో చదువుకునే గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మంకిడి ఎర్రయ్య అన్నారు. బుధవారం మడగూడెంగిరిజన బాలుర వసతి గృహంను సందర్శించారు. ప్రభుత్వం ప్రకటించే మెనూ ప్రకారం బోజనం వడ్డించాలని అన్నారు. ఎడీడీవో భాస్కర్ హెచ్‌ఎం రాములు, డిప్యూటీ వార్డెన్ పూనెం పూర్ణచందరావు పాల్గొన్నారు.

రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తాం : డీసీవో

కురవి, జూలై 3 : రైతుబంధుపై రైతులు వ్యక్తం చేసిన అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని సొసైటీ డీసీవో వెంకటేశ్వర్లు అన్నారు. గుండ్రాతిమడుగు రైతువేదికలో బుధవారం రైతుబంధు పథకంపై రైతుల సలహాలు, సూచనలు సేకరించారు. సొసైటీ చైర్మన్ గార్లపాటి వెంకట్‌రెడ్డి, బస్వ శ్రీను, జంగిలి హరిప్రసాద్, గుగులోతు లక్ష్మణ్, ఏఈవో రమేష్, సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

- గార్ల : గార్ల మండల కేంద్రంలోని వర్తకసంఘం భవనంలో రైతుభరోసాపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యుడు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం హాజరైన రైతుల నుంచి రైతుభరోసాపై అభిప్రాయంసేకరించి ప్రభుత్వానికి నివేదికలు అందించనున్నట్లు చెప్పారు. పీఏసీఎస్ చైర్మన్ వడ్లముడి దుర్గాప్రసాద్, ఎంపీపీ నాగరాజు, మాజీ ఎంపీపీ వెంకట్‌లాల్, ఏవో రామారావు పాల్గొన్నారు.

'పదోన్నతులు కల్పించాలి'

మహబూబాబాద్ టౌన్, జూలై 3 : మునిసిపాలిటీల్లో పదోన్నతులు లేకుండ దీర్ఘకాలికంగా పనిచేస్తున్న ఉద్యోగులకు అర్హతలను బట్టి పదోన్నతులు కల్పించాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్, తెలంగాణ మునిసిపల్ ఉద్యోగుల సంఘం నాయకులు సింగు రమేష్ విజ్ఞప్తి చేశారు. మానుకోటలో జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోకు బుధవారం వినతిపత్రాలు అందజేశారు. లింగాల కుమార్, రామకృష్ణ, దిలీప్, కిశోర్, శ్రీనివాస్, లావణ్య, సుధాకర్, కిరణ్, మమ్ముట్టి, అనిల్, అన్సారీ పాల్గొన్నారు.

దివ్యాంగుల పెన్షన్ రూ.6వేలకు పెంచాలి

- ఎన్పీఆర్డీ జిల్లా అధ్యక్షుడు వర్రె బాలకృష్ణ

మహబూబాబాద్ టౌన్, జూలై 3 : దివ్యాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్పీఆర్డీ)జిల్లా జిల్లా అధ్యక్షుడు వర్రె బాలకృష్ణ విజ్ఞప్తి చేశారు. సదరు డిమాండ్‌తో మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎన్పీఆర్డీ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో రడం సారయ్య, ప్రభాకర్, వెంకన్న, యాకయ్య, ఎల్లయ్య, మణెమ్మ, పద్మ నరేష్, గౌరమ్మ, సరిత, పాల్గొన్నారు.

- మహబూబాబాద్ శివారులోని ఆర్టీసీ కాలనీలో ఇళ్ల మధ్య ఏర్పాటు చేస్తున్న సెల్‌టవర్ నిర్మాణ పనులను నిలపివేయాలని ఆర్టీసీ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పట్టాభి లక్ష్మయ్య కార్యదర్శి మాలోతు చంద్యానాయక్, కోశాధికారి అంగోతు సుందర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు మనోజ్‌కుమార్, పద్మ, క్రిష్టారెడ్డి, నీరజ, విజయ, యాదగిరి,శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బాబుకు స్వాగతం పలికేందుకు తరలిరావాలి

- టీటీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి పుల్లయ్య



టీడీపీ ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న బండి పుల్లయ్య

మహబూబాబాద్ టౌన్, జూలై 3 : ఏపీసీఎంగా ప్రమాణస్వీకారం చేసి తొలిసారిగా ఈనెల 5న హైదరాబాద్‌కు వస్తున్న చంద్రబాబుకు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలని టీడీపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీఎమ్మెల్యే బండి పుల్లయ్య పిలుపునిచ్చారు. హైదరాబాద్ ఎన్టీఆర్‌ట్రస్ట్ భవన్‌లో బుధవారం టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్‌కుమార్ సమక్షంలో ఆ పార్టీ తెలంగాణ ముఖ్యనేతలు సమావేశమయ్యారు.చంద్రబాబు పర్యటన సక్సెస్‌పై చర్చించారు.

ఎంజేపీ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

తొర్రూరు రూరల్, జూలై 3 : మహాత్మాజ్యోతిబా పూలే సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను అడ్మిషన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.హరిప్రసాద్ బుధవారం తెలిపారు. నాంచారి మడూరు గ్రామశివారులో ఉన్న పాలకుర్తి ఎంజేపీ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అడ్మిషన్లకు 2024 జూలై 8వ తేదీ వరకు బీఏ, బీఎం, బీఎస్సీ, బీజడ్‌సీ గ్రూపులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మెరిట్ మార్కుల ఆధారంగా ఎం పిక చేయడం జరుగుతుందని ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోగలని సూచించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

తొర్రూరు రూరల్, జూలై 3 : విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందిన సంఘటన బుధవారం తొర్రూరు మండలం గుర్తూర్‌లో చోటు చేసుకుంది. గుర్తూర్ గ్రామానికి చెందిన రైతు కమ్మగాని రమేష్ తనకు ఉన్న గేదెలను మేతకు తీసుకెళ్తుండగా గ్రామశివారులోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కింది వేలాడుతన్న వైరుతగిలి అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. రూ.లక్షల విలువల చేసే గేదె మృతితో రైతు రోధిస్తున్నారు.

జెండాల తండాలో యువతి ఆత్మహత్య

మరిపెడ రూరల్, జూలై 3 : ప్రేమవిఫలమై ఓ యువతి ఇంట్లోని ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటనబురున్‌పురం శివారు జెండాలతండా (డీఎస్ఆర్ తండా) జీపీలో చోటు చేసుకుంది. బుధవారం స్థానిక ఎస్సై సంతోష్ వివరాల ప్రకారం. జెండాలతండా (డీఎస్ఆర్ తండా) జీపీకి చెందిన బాదవత్ అనూష (20) అదే తండాకు చెందిన భూక్య సురేష్ అనే వివాహితుడిని ఆరునెలలుగా ప్రేమిస్తుంది. ఇటీవల పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహించి బాదవత్ అనూష, భూక్య సురేష్‌లను మందలించారు. తల్లిదండ్రులు రోజువారీగా వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లగా ఇంట్లోఎవరిలేని సమయంలో అనూష చీరెతో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి కోట్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'పైసలిస్తేనే ఫైలు ముందుకు' కథనంపై..

ఇంటెలిజెన్స్ అధికారుల ఆరా

- 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

నర్సింహులపేట, జూలై 3 : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 'పైసలిస్తేనే ఫైలు ముందుకు' చక్రం తిప్పుతన్న ప్రైవేటు వ్యక్తి అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన కథనంపై ఇంటెలీజెన్స్, స్పెషల్ బ్రాంచ్ అధికారులు క్షేత్రస్థాయిలో ఆరా తీసినట్లు సమాచారం. ప్రైవేటు వ్యక్తి ఎవరు.. ఏ గ్రామానికి చెందిన వారు.. రెవెన్యూ అధికారులతో చనువుగా ఎందుకు ఉంటున్నాడనే విషయంపై ఆరాతీసి జిల్లా ఉన్నతాధికారులకు నివేధించినట్లు తెలుస్తుంది. ప్రైవేటు వ్యక్తిపైవేటు పడుతుందా, ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

సైబర్ క్రైమ్ సీఐ వెంకటేశ్వర్లు

పెద్దవంగర, జూలై 3 : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైమ్ సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పెద్దవంగరలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్సై మహేష్‌తో కలిసి సైబర్‌నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫోన్‌లలో ఓటీపీ, పేటీఎం, గూగుల్‌పే, ఫోన్‌పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించొద్దన్నారు. ఎవరైనా, ఎక్కడైనా సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్‌ఫ్రీ నంబరును సంప్రదించాలన్నారు. హెచ్‌ఎం కళాధర్, పోలీసు సిబ్బంది సురేష్, విజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన ఉండాలి

- అదనపు ఎస్పీ చెన్నయ్య



రికార్డులను పరిశీలిస్తున్న ఏఎస్పీ చెన్నయ్య

నర్సింహుల పేట, జూలై 3 : కేంద్ర ప్రభుత్వం జూలై 1 నుంచి అమలులోకి తీసుకువచ్చిన నూతన చట్టాలపై ప్రజలు, పోలీస్ అధికారులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా అడిషనల్ ఎస్పీ చెన్నయ్య అన్నారు. నర్సింహుల పేట పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి అక్కడి పరిశరాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎస్సై జి.సతీష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.